# ఒడిషా కౌలురైతుల హక్కుల కోసం ఆందోళన

**ఒడిషాలో** కౌలురైతుల జీవితాలు బహు దుర్భరంగా మారాయి. మొత్తం రైతాంగంలో అధిక భాగంగా వున్న కౌలురైతులు అప్పుల భారంలో కూరుకు పోయి అనేకమంది నిస్సహాయంగా బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. కౌలురైతులెవరికీ ప్రభుత్వం చట్ట ప్రకారం గుర్తింపునివ్వలేదు. భూ యజమానికి – కౌలురైతుకు మధ్య కౌలు ఒప్పందం మూజువాణిగానే వుంటుంది. నిర్దిష్టకాల పరిమితిని విధించడం కూడా లేదు. వ్రాతపూర్వక ఒప్పందాలు కొన్ని వున్నా అవి ఏవీ రిజిష్టర్ చేయలేదు. భూ యజమాని కౌలుదారుడైన రైతు సాగుచేసుకొనే ఆ భూమిని అమ్మదలిస్తే, ఆ భూమి కొనుగోలు చేసేందుకు ఆ కౌలురైతుకే ప్రథమ ప్రాధాన్యత నివ్వాలనే చట్టపరమైన రక్షణలేవీ వీరికి లభించవు. ఫలితంగా, సంవత్సరాల తరబడి ఆ భూమిలో సాగుచేసే రైతు నిర్దాక్షిణ్యంగా ఆ భూమి నుండి గెంటివేయబడు తున్నాడు. భూ యజామానికి – కౌలురైతుకు మధ్య, పండించిన పంటను పంచుకునే చట్టబద్ధంగా నిర్వచించిన విధానమేదీ లేదు. కనుక తమ చిత్తమొచ్చిన విధంగా కౌలుధరను నిర్ణయించే భూ యజమానుల దయా దాక్షిణ్యాలకు కౌలురైతు వదలివేయబడుతున్నాడు. బ్యాంకులు, సహకార సంస్థల నుండి రుణాలు పొందటానికి ఈ కౌలురైతులంతా చట్టపరంగా అనర్హులు కావటం ఫలితంగా వ్యవసాయం కోసం వడ్డీవ్యాపారులపై ఆధారపడవలసి వస్తోంది. దీనికితోడు కరువు, వరదలు, తుపాన్ల కారణంగా పంటలు చేతికందకపోయినపుడు వీరి పరిస్థితి మరింత దుర్భరమౌతుంది. పైగా ప్రభుత్వం నుండి ఏ మేరకైనా లభించే ఉపశమనాలు, సబ్సిడీలు, సహాయాలేవీ ఈ కౌలురైతులకందవు. ఎందుకంటే చట్టపరంగా వీరంతా రైతులుగా గుర్తింపు పొందలేదు గనుక!

ఈ నేపథ్యంలో ఒడిషాలోని అనేక రైతుసంఘాలు మరియు కౌలు రైతుల శ్రేయోభిలాషులు ఈ సమస్యలపై స్థానిక స్థాయిల్లోనూ, రాష్ట్రస్థాయిల్లోనూ కౌలురైతులను సమీకరించే కార్యక్రమం కొంతకాలంగా చేస్తూ వస్తున్నారు.

ఇటీవల ఒడిషా రాష్ట్ర ప్రభుత్వం కౌలురైతుల హక్కులను పరిరక్షిస్తున్నట్లు కనబడే కొంత కసరత్తు చేసింది. కానీ, వాస్తవానికి అది కౌలురైతులపై నిర్దాక్షిణ్యమైన, అప్రకటిత దాడి! బడా భూస్వాములపై ఆధారపడి భూములను సంఘటీకరించేందుకు తద్వారా వ్యవసాయాన్ని కార్పొరేటీకరించేందుకు ప్రభుత్వం తలపెట్టింది.

2016 ఏప్రిల్ 30న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి – కౌలురైతులకు, రైతులకు ఓ ప్రశ్నావళిని అందచేసి, వానికి సమాధానాలు కోరారు. ప్రతి తహశీల్ పరిధిలోనూ 50 మంది రైతులతో తహశీల్దార్లు సమావేశమయ్యారు. ప్రశ్నావళిపై రైతుల అభిప్రాయాలను సేకరించి, నివేదికను ఆయా జిల్లాల కలెక్టర్లకు అందచేశారు. అయితే, రైతు సంఘాలు మరియు కౌలురైతుల శ్రేయోభిలాషులు దీనినంతా ప్రభుత్వ తంతుగా, కంటితుడుపుగా పేర్కొన్నారు. కౌలురైతులలో అత్యధిక సంఖ్యాకులైన వారి అభిప్రాయాలను సేకరించటానికిగానీ, రైతు సంఘాల, కౌలురైతుల శ్రేయోభిలాషుల వాదనలను, వారి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవటానికిగానీ ఇది ఉద్దేశించింది కాదు.

అయినప్పటికీ, భూమి అధికార్ ఆందోళన్ – ఒడిషా ఆధ్వర్యంలో ఏఐకెఎస్, సిఎంఎస్ – ఒడిషా, ఏఐకెఎమ్ఎస్, ఎబికెఎంఎస్, ఏఐపిఎఫ్, ఏబికెఎస్ మరికొందరు ప్రజాస్వామికవాదుల సహకారంతో 2016 మే 23న కౌలురైతుల హక్కుల సాధనకై ఒక రాష్ట్రస్థాయి సదస్సును భువనేశ్వర్‌లో నిర్వహించారు.

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి 600 మందికి పైగా ప్రజలు, కౌలురైతులు ఈ సదస్సులో పాల్గొన్నారు. మాజీ ఆర్థికశాఖామంత్రి శ్రీ పంచానన్ కనుంగో వంటి వారితోపాటు వివిధ రైతుసంఘాలకు ప్రాతినిధ్యం వహించే నేతలు ఈ సదస్సులో ప్రసంగించారు. కౌలు రైతులపట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని వక్తలంతా తీవ్రంగా వ్యతిరేకించారు. సదస్సుకు ముందుగా కీలక పత్రాన్ని సదస్సు ప్రతినిధులముందుంచారు.

ఏఐకెఎమ్‌కెఎస్ అనుబంధ సంస్థ చాషీమూలియా సంఘ్ నాయకులైన శ్రీకాంత్ మొహంతి, బాసుదేవ్‌షా ఈ సదస్సులో ప్రసంగించారు. ప్రభుత్వానికి అంద చేయాల్సిన నివేదికలో చేర్చాల్సిన అంశాలను వారు తమ ఉపన్యాసాలలో పేర్కొన్నారు.

ఏఐకెఎమ్‌కెఎస్ అనుబంధ సంఘమైన చాషీమూలియా సంఘ్, ఒడిషా – ప్రజల భూమిహక్కు కోసం జరుగుతున్న ఆందోళనల్లో చురుగ్గా పాల్గొంటున్నది. పూరి, గంజాం, కోరాపుట్, భద్రక్, కియోందుర్ఘూర్ జిల్లాలలో సిఎంఎస్ ఆధ్వర్యంలో అనేక ప్రదర్శనలు, నిరసనసభలు, అధికారులకు విజ్ఞానపత్రాలు అంద జేయటం జరిగింది. గంజాం జిల్లాలో–సొరొడా, జగన్నాథ్ ప్రసాద్, సన్నథముండి; పూరి జిల్లాలో బ్రహ్మగిరి; భద్రక్ జిల్లాలో కోరాపుట్; కియోందుర్ఘూర్ జిల్లాలో హటాడి ప్రాంతాల్లో వందలాది ప్రజానీకం ఈ ప్రదర్శనలలో, నిరసన సభల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల అనంతరం కూడా గ్రామాల్లో ప్రచారం కొనసాగింది. భూమి అధికార్ ఆందోళన్ ఆధ్వర్యంలో కౌలురైతుల హక్కుల సాధన కోసం ఆందోళన కొనసాగుతోంది. వారింకా విస్తృతంగా, మరింత ఎక్కువమంది కౌలురైతుల వద్దకు వెళ్ళి వారినం దరినీ సంఘటితంచేసి, నిరసనాందోళనలోకి సమీకరించటం ద్వారానే కౌలురైతులు వారి న్యాయమైన, ప్రజాస్వామికమైన డిమాండ్స్‌ను నెరవేర్చుకోగలుగుతారు.

oooooo